సాక్షి
వికారాబాద్
బుధవారం । 26 । మార్చి । 2025




రోడ్డుపై మృత్యుపాశాలు!

తాండూరు పట్టణంలో రహదారి విస్తరణ పనులు పూర్తయినా రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. 8లో▸



అన్నదాతకు ‘అకాల’ నష్టం

మండలంలో రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



న్యూస్‌రీల్

నూతన కమిటీ ఏకగ్రీవం



బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

కొడంగల్ రూరల్: కొడంగల్ అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎలక్షన్ ఆఫీసర్ పీ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పి.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా బసవరాజు, జనరల్ సెక్రటరీగా బి.వెంకటయ్య, జాయింట్ సెక్రటరీగా కె.రమేష్, కోశాధికారిగా శ్రీనివాస్ ఆనంద్, లైబ్రేరియన్ కార్యదర్శిగా బి.కృష్ణయ్య, కల్చరల్ కార్యదర్శిగా కె.రాములు, స్పోర్ట్స్ కార్యదర్శిగా ఎస్‌డీ.మొహీద్, లేడీ రిప్రజెంటేటివ్‌గా భాగ్యలతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మర్పల్లి తైబజార్ వేలం

రూ.5 లక్షలకు దక్కించుకున్న నాగేష్



తైబజార్‌కు వేలం నిర్వహిస్తున్న అధికారులు

మర్పల్లి: మర్పల్లి తైబజార్‌కు మంగళవారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన నలుగురు వేలం పాటలో పాల్గొన్నారు. తలారి నాగేష్ రూ.5లక్షల 11 వేలకు తైబజార్ దక్కించుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. గ్రామసభలో నిర్ణయించిన ప్రకారం వ్యాపారుల నుంచి ఏడాది పాటు రుసుం వసూలు చేసుకోవచ్చని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా రుసుం వసూలు చేస్తే తైబజార్ లైసెన్స్ రద్దు చేసి వేలం పాటలో రెండో వ్యక్తిగా నిలిచిన వారికి అప్పగిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాములు యాదవ్, మాజీ సర్పంచ్ పాండు నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు శేఖర్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగదీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు గణేశ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు సర్వేశ్, స్థానిక నాయకులు నర్సింలు యాదవ్, మారుతి, శివ, భరత్, వీరేశం, సీహెచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాలకు వేలం



దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న గ్రామ కార్యదర్శి అంజానాయక్

ధారూరు: ధారూరు గ్రామ పంచాయతీకి చెందిన దుకాణాలకు మంగళవారం గ్రామ కార్యదర్శి అంజానాయక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 2025–26 సంవత్సరానికి గాను 8 దుకాణాలకు బహిరంగ వేలం వేశారు. మొదటి దుకాణాన్ని రూ.40 వేలకు మహబూబ్‌ఖాన్, రెండో దుకాణాన్ని రూ.48 వేలకు ఇబ్రహీం, మూడో దుకాణాన్ని రూ.48,500 లకు దావూద్,4వ దుకాణం రూ.48 వేలకు ఇబ్రహీం, పాత దుకాణాల్లో 5వ షాపును రూ.28 వేలకు మహబూబ్‌ఖాన్, 6వ దుకాణం రూ.23 వేలకు మహ్మద్ ఉస్సేన్, 7వ దుకాణం రూ.7,500 లకు అబ్దుల్ నబీ, 8వ దుకాణం రూ.32 వేలకు ఫెరోజ్ ఖురేషి దక్కించుకున్నారు.

నేడు వాహనాల వేలం

అనంతగిరి: ఎక్సైజ్ శాఖ పరిధిలో ఆయా కేసుల్లో పట్టుబడిన మూడు బైక్‌లకు బుధవారం వేలం నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ సీఐ రాఘవీణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు తమ కార్యాలయం ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారు వేలం పాటలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 8712658755లో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాలను అరికడదాం

అనంతగిరి: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి బాధ్యత తీసుకోవాలని బాల రక్షణ భవన్ కోఆర్డినేటర్ కాంతారావు అన్నారు. మంగళవారం వికారాబాద్‌లోని స్త్రీ శక్తి భవనంలో సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని అన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సాధన సంస్థ డైరెక్టర్ మురళీమోహన్, సీడీపీఓ వెంకటేశ్వరమ్మ, ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జ్ అలీ మొద్దీన్, సాధన కోఆర్డినేటర్ నర్సింలు, సిబ్బంది యాదయ్య, జ్యోతి, రాములు, అంజయ్య, సఖి కోఆర్డినేటర్ యశోద, భరోసా ఇన్‌చార్జ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వినూత్న బోధన | విజ్ఞాన సాధన

ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త తరహా బోధనకు అడుగులు పడ్డాయి. ప్రాథమిక స్థాయి నుంచే ఏఐ ఆధారిత బోధన జరుగుతోంది. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో వర్చువల్ రియాలిటీ విధానంలో బోధన చేసేలా విద్యాశాఖ ముందడుగు వేసింది. పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని ఆరు పాఠశాలలను ఎంపిక చేయగా వాటిలో మూడు స్కూళ్లు దోమ మండలంలోనే ఉన్నాయి. ఏఐ ఆధారిత బోధన విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో ‘సాక్షి’ ప్రత్యేక కథనం.

సత్ఫలితాలిస్తున్న ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్

- పైలెట్ ప్రాజెక్టు కింద ఆరు పాఠశాలల ఎంపిక
- సమర్థవంతంగా అమలు చేస్తున్న ఉపాధ్యాయులు
- రాష్ట్రస్థాయిలో సత్తాచాటిన బొంపల్లి విద్యార్థి
- భవిష్యత్తులో మరిన్ని స్కూళ్లలో అమలయ్యే అవకాశం



ఇటీవల బొంపల్లి పాఠశాలలో ఏఐ ఆధారిత బోధనను పరిశీలిస్తున్న బెంగళూరు టీం సభ్యులు

దోమ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధ ఏఐ)కు ప్రాధాన్యత పెరుగుతోంది. ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఈ విధానంలో బోధన చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధనను గత నెల 24నుంచి ప్రారంభించింది. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల 5న బెంగళూరుకు చెందిన ఎక్‌స్టెప్ ఫౌండేషన్ ప్రతినిధులు మండలంలో ఏఐ బోధనా తీరును పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. పిల్లలు అనర్గళంగా మాట్లాడటం, చదవడం చూసి అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఏఐపై జరిగిన సదస్సులో జిల్లాలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆదిత్య అనే విద్యార్థి చక్కటి ప్రతిభ కనబరిచి బెస్ట్ స్టూడెంట్‌గా ఎంపికయ్యారు.



మొదటి లెవెల్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు(ఫైల్)

సామర్థ్యాల పెంపే లక్ష్యం

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడం, సామర్థ్యాల మదింపు, మార్గనిర్దేశం చేయడమే ఏఐ ప్రధాన లక్ష్యం. ప్రస్తుతం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఈ తరహా బోధన సాగుతోంది. పాఠ్యాంశాలను ప్రోగ్రామ్‌గా రూపొందించి అమలు చేస్తున్నారు. ఉపాధ్యాయుడు పాఠం చెప్పిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు ప్రశ్నలు పంపుతారు. వాటికి సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఒక వేళ జవాబులో తప్పులుంటే సరి చేసుకునే వరకు ఏఐ టెక్నాలజీ సూచనలు చేస్తూనే ఉంటుంది.

60మంది విద్యార్థులకు..

జిల్లాలో ఏఐ ఆధారిత బోధనకు బొంపల్లి, గడిసింగాపూర్, కొడంగల్, ఎన్నారం, పుల్‌మామిడి, సాయిపూర్ ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాల నుంచి 20 మంది చొప్పున ఆరు స్కూళ్ల నుంచి 120 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఏఐలో తొమ్మిది లెవెల్స్ ఉంటాయి. ప్రతి విద్యార్థీ ఒక్కో లెవల్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. అన్ని అంచెలు పూర్తి చేసిన వారికి బెస్ట్ స్టూడెంట్ సర్టిఫికెట్లు అందజేస్తారు.

వారానికి 40 నిమిషాలు

ఏఐ ఆధారిత బోధనకు ఎంపికైన పాఠశాలలకు కంప్యూటర్లు, ప్రింటర్లు అందజేశారు. వారానికి 40 నిమిషాల చొప్పున బోధన చేస్తున్నారు. 20 నిమిషాల చొప్పున రెండు సెషన్స్ ఉంటాయి. మొదట తెలుగు, ఆ తర్వాత మ్యాథమెటిక్స్ బోధించాల్సి ఉంటుంది. అయితే కొన్ని పాఠశాలల్లో మ్యాథ్స్ ప్రోగ్రాం అందుబాటులోకి తీసుకరాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. తెలుగు, ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడేందుకు, గణితంపై పట్టు సాధించేందుకు ఏఐ ఎంతగానో దోహదపడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో ఏఐ బోధన సక్సెస్ అయితే మిగతా స్కూళ్లలో అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ఏఐ పాఠాలను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి(ఫైల్)

సులువుగా అర్థమవుతోంది



ఏఐ విధానంలో బోధన చాలా బాగుంది. పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయి. నేను ఏఐ ఆధారిత పద్ధతిలో పాఠాలు నేర్చుకున్నా.. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సదస్సుకు నన్ను తీసుకెళ్లారు. అక్కడ జరిగిన ప్రతిభా పరీక్షలో చక్కటి ప్రదర్శన ఇవ్వడంతో నన్ను బెస్ట్ స్టూడెంగ్‌గా ఎంపిక చేశారు. ఇది ఎంతో సంతోషాన్ని ఇచ్చింది.

– ఆదిత్య, 4వ తరగతి, బొంపల్లి ప్రాథమిక పాఠశాల

తొమ్మిది లెవెల్స్



ఏఐ ఆధారిత బోధన 20 నిమిషాల పాటు కొనసాగుతుంది. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేస్తున్నాం. మొదట పిల్లలు తడబడుతున్నారు. ఆ తర్వాత అర్థం చేసుకొని లెవెల్‌ను పూర్తి చేస్తున్నారు. ఏఐలో మొత్తం తొమ్మిది లెవెల్స్ ఉంటాయి. అన్ని పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్నాం. లెవల్స్ పూర్తి చేయని విద్యార్థులకు మళ్లీ అవకాశం కల్పిస్తున్నాం.

– షఫీ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, బొంపల్లి

మూడు పాఠశాలల్లో ..



దోమ మండలంలోని మూడు ప్రాథమిక పాఠశాలల్లో ఏఐ ఆధారిత బోధన సాగుతోంది. తొలుత బొంపల్లి పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆ తర్వాత మోత్కుర్, దాదాపూర్ ప్రాథమిక పాఠశాలను చేర్చారు. ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో ఏఐ ఆధారిత బోధనను సమర్థవంతంగా అమలు చేస్తున్నాం. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకుంటున్నారు.

– వెంకట్, ఎంఈఓ, దోమ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

రైతులకు ప్రభుత్వం అండ

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- హకీంపేట్ రైతులతో సమావేశం
- ఒకే విడతలో పరిహారం అందజేస్తామని వెల్లడి

అనంతగిరి: పారిశ్రామిక పార్కు కోసం భూములు ఇచ్చే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, ఒకే విడతలో పరిహారం అందజేస్తుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ సభ్యులు దుద్యాల్ మండలం హకీంపేట్ రైతులతో సమావేశమయ్యారు. భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చిన 114 మంది రైతులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హకీంపేట్‌లో 146.34 గుంటల పట్టాభూమి ఉందని తెలిపారు. భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే రైతులతో అగ్రిమెంట్ చేసుకొని ముందుకెళ్తామన్నారు. జిల్లాస్థాయి సంప్రదింపుల కమిటీ నిర్ణయం ప్రకారం పరిహారం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఎకరాకు రూ.20 లక్షలు, 150 గజాల ఇంటి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు, అర్హత ఆధారంగా ప్రతి ఇంటికీ ఒక ఉద్యోగం ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) లింగ్యానాయక్ , తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ శారద, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ అజీమ సుల్తానా, దుద్యాల్ మండలం తహసీల్దార్ కిషన్, హకీంపేట రైతులు పాల్గొన్నారు.

గత పాలకులతోనే వరద ముప్పు

- అసెంబ్లీ సమావేశాల్లో తాండూరు సమస్యలపై గళం వినిపించిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎంఆర్

తాండూరు: గత పాలకుల నిర్లక్ష్యం వల్లే తాండూరు మున్సిపాలిటీ చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతోందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల్లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆయనకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా తాండూరు సమస్యలను వినిపించారు. 1953లో తాండూరు మున్సిపాలిటీగా ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో మూడు సిమెంట్ కర్మాగారాలు, నాపరాతి గనులు, పరిశ్రమలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కూలీలు, ప్రజలు వచ్చి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గత పాలకులు మున్సిపాలిటీలో జనాభాకు తగ్గట్లు అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. చిన్నపాటి వర్షం వచ్చినా పట్టణ పరిధిలోని సాయిపూర్, శాంతినగర్, హైదరాబాద్ మార్గంలోని ప్రాంతాలన్నీ ముంపునకు గురవుతున్నాయని సభ దృష్టికి తెచ్చారు. చిలుక వాగును ప్రక్షాళన చేయడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించవచ్చని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధిత శాఖ మంత్రులు నిధులు కేటాయించాలని కోరారు. తాండూరు ప్రాంతానికి నాగర్ కర్నూల్ జిల్లా నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతోందని.. చాలా దూరం నుంచి నీటి సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తాండూరుకు పక్కనే ఉన్న కగ్నానదిలో 1965లో తాగునీటి కోసం పంప్‌హౌస్ నిర్మించారని.. తరచూ మోటార్లు కాలిపోతున్నాయని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. స్పందించిన మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే చెప్పిన వివరాలను నోట్ చేసుకొన్నట్లు పేర్కొన్నారు.

‘ఫ్యూచర్’ బాధిత రైతులను ఆదుకోవాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో భూములు కోల్పోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. భూ బాధితుల పక్షాన పోరాటం చేయడానికి మంగళవారం జీపు జాతను ప్రారంభించారు. మండలంలోని ఆకులమైలారం, మీర్‌ఖాన్‌పేట,బేగరికంచె, సార్లరావులపల్లి, సాయిరెడ్డిగూడ, ముచ్చర్లలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో అప్పటి సీఎం కేసీఆర్ 15వేల ఎకరాలు సేకరించారని, అధికారంలోకి రాకముందు రేవంత్‌రెడ్డి ఫార్మాను రద్దు చేస్తామని చెప్పి, ఫ్యూచర్ సిటీ పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకుని అదనంగా భూములు తీసుకుంటున్నారన్నారు. 2013 చట్టం ప్రకారం రైతులను సమావేశపరిచి, వారి సమ్మతి తోనే భూములు సేకరించాలన్నారు. ఫ్యూచర్ సిటీ గ్రామాల్లో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే పాదయాత్రకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని హాజరు కానున్నట్లు తెలిపారు.



తిరుచ్చి వాహనంపై ఉత్సవమూర్తులు

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ చేశారు. శ్రీవారి ఆలయం నుంచి ఉత్సవమూర్తులను శాంతినగర్ కాలనీలోని పారువేట మంటపం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్ట మన్ను సేకరించారు. పుట్ట మన్నును ఉత్సవమూర్తుల వద్ద ఉంచి శుద్ధి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన అర్చకులు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం సాయంత్రం 6గంటలకు ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తారు. రాత్రి 9నుంచి 11 గంటల వరకు దేవేరుల సమేతంగా స్వామివారి ఉత్సవ మూర్తులను పెద్ద శేష వాహనంపై ప్రతిష్ఠించి ఆలయ మాఢవీధుల్లో భక్తుల దర్శనార్థం ఊరేగింపు నిర్వహిస్తారు.

–కొడంగల్



పుట్టమన్నుకు పూజ చేస్తున్న అర్చకులు

రమణీయం.. రథోత్సవం

కుల్కచర్ల మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర స్వామి రథోత్సవం మంగళవారం తెల్లవారుజామున నేత్రపర్వంగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. సోమవారం రాత్రి పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భజన, భక్తసిరియాల వీధి నాటకాన్ని ప్రదర్శించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, ఈఓ బాలనర్సయ్య తెలిపారు.

– కుల్కచర్ల



అప్రమత్తతే రక్ష

- అగ్గి రాజుకుంటే బుగ్గే..
- పరిశ్రమల్లో తరచూ అగ్నిప్రమాదాలు
- వేసవి వేళ జాగ్రత్తలు ముఖ్యం
- ఎప్పటికప్పుడు తనిఖీలు చేసుకోవాలి: అగ్నిమాపక సిబ్బంది



నందిగామలోని అలైన్ ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదం (ఫైల్)

షాద్‌నగర్: వేసవి కాలం ప్రారంభమైంది.. అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అప్రమత్తంగా ఉండకుంటే భారీ నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది. అగ్నిమాపక కేంద్రాలు ఉన్నా సంఘటనా స్థలానికి చేరుకునేలోపు ఉన్న ఆస్తి కాస్తా అగ్నికి ఆహుతయ్యే అవకాశం ఉంది. వేసవి నేపథ్యంలో పరిశ్రమల వర్గాలు, వ్యాపారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచిస్తున్న అగ్నిమాపక సిబ్బంది.

తరచూ ప్రమాదాలు

షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు, నందిగామ, షాద్‌నగర్ ప్రాంతాల్లో సుమారు 350కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. 50 వేలకు పైగా కార్మికులు పని చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలు ముఖ్యంగా కాటన్, జిన్నింగ్, ఆయిల్, హెర్బల్ పరిశ్రమల్లో అధికంగా జరుగుతున్నాయి. కోట్లాది రూపాయల ఉత్పత్తులు, యంత్రాలు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియక భయంతో పని చేయాల్సి వస్తోంది. 11 నెలల క్రితం నందిగామలో పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న అలైన్ ఫార్మా హెర్బల్ పరిశ్రమలో వెల్డింగ్ చేస్తుండగా నిప్పు రవ్వలు స్పాంజ్, థర్మాకోల్ షీట్లపై పడటంతో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఐదు నెలల క్రితం అన్నారం గ్రామ శివారులోని ఆయిల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి భారీ నష్టం వాటిల్లింది. ఇటీవల బైపాస్ రోడ్డులో వ్యర్థాలకు గుర్తు తెలియని వారు నిప్పంటించారు. గతంలో మొగిలిగిద్ద గ్రామ శివారులో రబ్బర్ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. షాద్‌నగర్ శివారులోని బైపాస్ జాతీయ రహదారిపై వెళ్తున్న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన ఘటనలు ఉన్నాయి. భారీ ప్రమాదాలు జరిగితే షాద్‌నగర్ ఉన్న అగ్నిమాపక శకటాలతో పాటు, శంషాబాద్, రాజేంద్రనగర్, జడ్చర్ల తదితర ప్రాంతాల నుంచి శకటాలను రప్పించి మంటలను ఆర్పేస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవి కాలం ప్రారంభం కావడంతో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. పరిశ్రమల్లో, వ్యాపార సముదాయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు ఉంటాయి. పరిశ్రమల నిర్వాహకులు, వ్యాపారస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ వారు సూచిస్తున్నారు. మంటలను ఆర్పేందుకు విధిగా మంచినీటిని అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా చాలా పరిశ్రమల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు జరుగుతుంటాయి. యంత్రాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు సరిగా ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చూసుకోవాలని చెబుతున్నారు.

క్లుప్తంగా

ఆలయ కమిటీ ఎన్నికకు దరఖాస్తు చేసుకోండి



నోటిఫికేషన్ కాపీని చూపిస్తున్న ఎండోమెంట్ అధికారి కృష్ణప్రసాద్

మర్పల్లి: మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల నియామకానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కాపీని ఎండోమెంట్ అధికారి కృష్ణప్రసాద్ మంగళవారం మర్పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామస్తులకు అందజేశారు. అనంతరం నోటీస్ బోర్డుపై అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరవై రోజుల్లో ఆలయ చైర్మన్, పాలక మండలి సభ్యుల ఎన్నిక కోసం ఎండోమెంట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ (బొగ్గులకుంట, తిలక్‌రోడ్డు, హైదరాబాద్) కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు. ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూజారి వినోద్‌శర్మ, గ్రామస్తులు రాములు యాదవ్, సర్వేశ్, నర్సింలు యాదవ్, జగదీశ్, రాచన్న, రంజిత్, రంగారెడ్డి, వీరేశం ఉన్నారు.

ఆటో బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన బందయ్య, అంజమ్మ

పరిగి: ఆటో బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన పట్టణ కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్ సమీపంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బందయ్య, అంజమ్మ పరిగి నుంచి ఇంటికి వెళ్తుండగా కొడంగల్ వైపు నుంచి వస్తున్న ఆటో బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో వారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 సహాయంతో పరిగి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలించినట్టు సమాచారం. ఈ రోడ్డు ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం



మాట్లాడుతున్న ఎస్‌ఐ అబ్దుల్ గఫార్

బంట్వారం: మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నపిల్లలు అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం చేరవేయాలన్నారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, ఫొటో మార్ఫింగ్స్, పోక్సో చట్టం తదితర అంశాలపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శివయ్య, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల, సీసీలు గణేష్, హన్మంత్ రెడ్డి, సునీత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై ఆందోళన

పరిగి: తెలుగు రాష్ట్రాల్లో క్రైస్తవ మత ప్రచారకుడైన పాస్టర్ ప్రవీణ్ పడగాల మృతి ఆందోళన కల్గించే అంశమని వికారాబాద్ జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు క్రిష్ణ మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

నడి రోడ్డుపై మృత్యుపాశాలు!

తాండూరు పట్టణంలోని అంతారం మార్గంలో 6 నెలల క్రితం రోడ్డుపై నిలిచి ఉన్న లారీపై విద్యుత్ తీగ తెగి పడటంతో పూర్తిగా దగ్ధమైంది. మరో ఘటనలో చించోళి మార్గంలోని శివాజీ చౌక్ వద్ద వేగంగా వచ్చిన లారీ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పాదచారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు తాండూరులో నిత్యకృత్యంగా మారాయి. ప్రధాన రోడ్డును విస్తరించినా విద్యుత్ స్తంభాలను తొలగించక పోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

రహదారి విస్తరించినా.. తొలగించని కరెంట్ స్తంభాలు

- నిధులు లేవంటూ కాలయాపన చేస్తున్న విద్యుత్‌శాఖ
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు



తాండూరు పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

తాండూరు: పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టినా విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. దీంతో నాలుగేళ్లుగా ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడి రోడ్డుపైనే ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో రెండుసార్లు వాటి దిమ్మెలను వాహనాలు ఢీకొన్నాయి. మరోవైపు మున్సిపల్ పరిధిలోని శివాజీ చౌక్ నుంచి సీతారాంపేట్ పాండురంగ స్వామి దేవాలయం వరకు మార్గంలో నడిరోడ్డుపై విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. పాత తాండూరు ప్రాంతంలోనూ అదే పరిస్థితి నెలకొంది.

రూ.1.92 కోట్లతో ప్రతిపాదనలు

తాండూరు మున్సిపల్ పరిధిలో ప్రధాన రోడ్లపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి మరోచోట నాటేందుకు రూ.1.92 కోట్ల నిధులు అవసరముంది. అందుకోసం గతేడాది విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు. శివాజీ చౌక్ నుంచి ముర్షద్ దర్గా మార్గంలో విద్యుత్ స్తంభాలను తొలగించేందుకు 30 పోల్స్ అవసరమవుతాయి. తీగలు, విద్యుత్ పరికరాలకు మొత్తం కలిపి రూ.22.44 లక్షల నిధులు కావాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు పురపాలక సంఘం ఆధీనంలోకి రావడంతో మున్సిపల్ అధికారులను నిధుల కోసం కోరితే వారం రోజుల క్రితం రూ.8 లక్షల నిధులను విద్యుత్ శాఖ ఖాతాలో జమ చేశారు. మరోవైపు పాత తాండూరులో రూ.1.45 కోట్లు, అంతారం రోడ్డుపై ఉన్న స్తంభాల తొలగింపునకు రూ.24.25 లక్షల నిధులు వెచ్చించాలి. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలో ఉండటంతో నిధులను సమకూర్చాలని విద్యుత్ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించి ఏడాది దాటినా ఎలాంటి స్పందన లేదు.



రోడ్డు పక్కనే విద్యుత్ స్తంభాలు

నిధులు కేటాయిస్తేనే పనులు

తాండూరు పట్టణంలో నడిరోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయి. విద్యుత్ శాఖలో నిధుల లేమి కారణంగా పనులు చేపట్టడం లేదు. మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధీనంలో రోడ్లపై ఉన్న విద్యుత్ తీగలను తొలగించేందుకు నిధులు ఇవ్వాలని కోరాం. విడుదల కాగానే వెంటనే పనులు చేపడతాం.

– శంకర్‌నాయక్, ఏడీఈ, విద్యుత్‌శాఖ, తాండూరు

బకాయిలు వసూలు చేయాలి

మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్



పన్ను వసూలు చేస్తున్న సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్

కొడంగల్ రూరల్: మున్సిపాలిటీకి రావాల్సిన పన్ను బకాయిలను పూర్తిగా వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ పేర్కొన్నారు. మార్చి మొదటి వారం నుంచి చివరి తేదీ వరకు పన్ను వసూలు చేయాలని టార్గెట్‌గా పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితో ఆయా కాలనీలలో తిరుగుతూ పన్ను వసూలుకు కృషిచేస్తున్నారు. ప్రజలకు పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కమిషనర్ బలరాంనాయక్ అవగాహన కల్పిస్తున్నారు.

ఇప్పటివరకు 75శాతం పూర్తి

మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటివరకు 75శాతం పన్ను వసూలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. మార్చి నెలలో మిగిలిన 6రోజుల్లో రెండు రోజులు సెలవు దినాలు. మిగిలిన 4రోజుల్లో బకాయి వసూలుకు అధికారులు, సిబ్బంది తీవ్రంగా కృషిచేస్తున్నారు.

అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ పరిధిలోని పట్టణంతో పాటు గ్రామాల్లో సిబ్బంది తిరుగుతూ పన్ను బకాయిలు వసూలు చేస్తూ, అభివృద్ధికి సహకరించాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 75శాతం పన్ను వసూలయ్యాయి. మిగిలిన బకాయి వసూలుకు కృషిచేస్తున్నాం.

– బలరాంనాయక్, మున్సిపల్ కమిషనర్

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

అనంతగిరి: రెండు రోజుల క్రితం ఓ న్యాయవాదిని అతి దారుణంగా హత్య చేసిన ఘటనను నిరసిస్తూ వికారాబాద్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విధులు బహిష్కరించారు. న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పంటల నష్టం అంచనా వేయాలి

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి



మల్లికార్జునగిరిలో పాడైన ఉల్లి పంటను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి, ఏఓ శ్రీకాంత్

మర్పల్లి: ఇటీవల కురిసిన వర్షానికి పాడైన పంటల నష్టాన్ని అంచన వేయాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మల్లికార్జునగిరి, బిల్‌కల్ గ్రామాలలో పాడైన పంటలను ఏఓ శ్రీకాంత్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. ఉల్లి, జొన్న, మొక్కజొన్న, కూరగాయ పంటలతో పాటు మామిడికి అపార నష్టం జరిగినట్లు రైతులు కంటతడి పెట్టారు. వ్యవసాయ శాఖ అధికారులు రెండు రోజుల్లో వచ్చి పంటనష్టం అంచన వేస్తారని ప్రభుత్వం నుంచి పరిహారం అందేవిధంగా కృషి చేస్తానని మహేందర్‌రెడ్డి రైతులకు భరోస కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ జోస్న, ఆయా గ్రామాల రైతులు అశోక్, ప్రమోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుమారు 200 ఎకరాల్లో పంట నష్టం..

మల్లికార్జునగిరి, బిల్‌కల్ గ్రామాలలో 80 ఎకరాల్లో ఉల్లి, 30 ఎకరాల్లో జొన్న, 40 ఎకరాల్లో మొక్కజొన్న, మరో 50 ఎకరాల్లో కూరగాయలు, మామిడి తోటలకు నష్టం వాటిల్లి ఉంటుందని ప్రాథమిక అంచన వేసినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి తెలిపారు. పంటలు పరిశీలించిన అనంతరం మర్పల్లి వ్యవసాయ మార్కెట్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచన వేసి ప్రభుత్వానికి నివేదికలు పంపితే స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి తీసుకుపోయి పంట నష్టం జరిగిన ప్రతీ రైతుకు ఎకరాకు రూ.10వేలు అందేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాములుయాదవ్, ఏఓ శ్రీకాంత్, ప్రభాకర్‌రెడ్డి, మల్లికార్జునగిరి అశోక్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: హస్నాబాద్‌లో రాలిన మామిడి కాయలు చూస్తూ దిగాలుగా కూర్చున్న రైతు

అన్నదాతకు 'అకాల' నష్టం

వరి, మామిడి పంటలపై తీవ్ర ప్రభావం

- నేల రాలిన కాయలు, వడ్లు
- పరిహారం అందించాలని రైతుల అభ్యర్థన

దుద్యాల్: రెండు రోజులుగా మండలంలో కురిసిన వడగళ్లు, అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హస్నాబాద్, ఆలేడ్, కుదురుమల్ల, దుద్యాల్, అల్లిఖాన్‌పల్లి, చెట్టుపల్లితండా, చిలుముల మైల్వార్, ఈర్లపల్లి, లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి గ్రామాల్లో కురిసిన వడగండ్ల వాన చేతికొచ్చిన పంటలకు నష్టం కలిగించింది. అసలే అరకొరగా కాచిన మామిడి కాయలు నేల రాలాయి. వడ్లు సైతం రాలిపోవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. చిలుముల మైల్వార్ గ్రామంలో నర్సింలు, రాజు, వడ్ల ఈశ్వరయ్య గౌడ్, శేఖరయ్యగౌడ్ తదితరులకు చెందిన సుమారు వంద ఎకరాలకు పైగా పొలంలో వడ్లు రాలిపోయాయి. హస్నాబాద్‌లో మామిడి తోటలకు ఎక్కువగా నష్టం జరిగింది. ప్రభుత్వం స్పందించి పరిహారం అందించాలని బాధితులు కోరుతున్నారు.



దుద్యాల్: చిలుములమైల్వార్ వద్ద పొలంలో రాలిన వడ్లు

కూలిన గూడు



బొంరాస్‌పేట: కూలిన ఇంట్లో బాధితులు

బొంరాస్‌పేట: అకాల వర్షంతో ఇల్లు కూలి ఓ దళిత బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. మండల పరిధిలోని వడిచర్లకు చెందిన గడ్డపు లాలమ్మది దళిత నిరుపేద కుటుంబం. తన కోడలు మొగులమ్మతో పాటు చిన్నారులతో కలిపి ఇంట్లో ఎనిమిది మంది ఉంటున్నారు. గత సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోయింది. ఈ విషయాన్ని మంగళవారం గ్రామ కార్యదర్శి సువర్ణకు తెలియజేశారు. రేకుల తలుపుతో కాలం గడుపుతున్న తమను ఆదుకోవాలని, అధికారులు స్పందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్నారు.

స్నేహితుల వద్దకు వెళ్తూ మృత్యువాత

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం
- అక్కడికక్కడే ఇద్దరు యువకుల దుర్మరణం
- రొంపల్లిలో విషాదఛాయలు



మనోజ్‌కుమార్ (ఫైల్)



నరేష్ (ఫైల్)

మోమిన్‌పేట: ఇద్దరు మిత్రులు కలిసి హైదారాబాద్‌లో ఉంటున్న తమ స్నేహితుల వద్దకు వెళ్తూ ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. బంట్వారం మండలం రొంపల్లికి చెందిన బైకని నరేష్(21), మంగలి మనోజ్‌కుమార్(19) హైదరాబాద్‌లో ఉన్న తమ మిత్రులను కలిసేందుకు సోమవారం రాత్రి బైక్‌పై బయల్దేరారు. 11 గంటల సమయంలో మోమిన్ పేట సమీపంలోని మొరంగపల్లి కార్తికేయ ఫ్యాక్టరీ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ప్రమాదాన్ని గమనించిన వాహనదారులు 108కు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న సిబ్బంది అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ అరవింద్ వివరాలు సేకరించారు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మనోజ్‌కుమార్ తుఫాన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. నరేశ్ వ్యవసాయంలో తండ్రికి సాయపడేవాడు. వీరి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి



మోమిన్‌పేట: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అరవింద్ తెలిపిన వివరాల ప్రకారం.. అంరాధికలాన్ గ్రామానికి చెందిన ఈర్లపల్లి కుమార్(42) కుటుంబ అవసరాల కోసం, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొడుకుకు చికిత్స చేయించేందుకు అప్పులు చేశాడు. ఇవి తీరే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గత ఆదివారం ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరంలోని ఉస్మానియాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూగజీవి నరక యాతన

యాలాల: చెట్టు కొమ్మ విరిగి పడటంతో ఓ కాడెద్దు కదలలేని స్థితిలో నరక యాతన అనుభవిస్తోంది. యాలాలకు చెందిన గడ్డం సత్యప్పకు చెందిన ఎద్దును పొలం సమీపంలోని వేపచెట్టు కింద కట్టేశాడు. సోమవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ ఈదురుగాలులు రావడంతో పెద్ద కొమ్మ విరిగి ఎద్దు నడుముపై పడింది. దీంతో లేచినిలబడలేక విలవిల్లాడుతోంది. జీవనాధారమైన ఎద్దు పరిస్థితిని చూసిన రైతు కన్నీటి పర్యంతమవుతున్నాడు. గిర్దావర్ శివచరణ్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంచార పశు వైద్య సిబ్బందికి సమాచారం ఇచ్చి, వైద్యం అందించాలని రైతుకు సూచించారు. ఎద్దు విలువ రూ.90వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

కేంద్ర మంత్రి బండిపై ఫిర్యాదు



అనంతగిరి: సీఐ భీంకుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

అనంతగిరి: బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై నిరాధారమైన ఆరోపణలు చేసిన కేంద్ర మంత్రి బండిసంజయ్‌పై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం వికారాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బండి సంజయ్ కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి ఆధారాలున్నా బయటపెట్టాలన్నారు. అవాస్తవ మాటలతో బీఆర్‌ఎస్ కార్యకర్తలను, కేసీఆర్ అభిమానులను మా మనస్సును గాయపరిచారన్నారు. ఇలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్, మండల అధ్యక్షుడు మైపాల్‌రెడ్డి, నాయకులు అశోక్, అనిల్, రాజేందర్, అనిల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ధారూరు: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం ధారూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. పార్టీ అభిమానులుగా మా మనోభావాలు దెబ్బతిన్నాయని, బండిసంజయ్‌పై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వారు ఎస్‌ఐ అనితకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ధారూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు చిన్నయ్యగౌడ్, జైపాల్‌రెడ్డి, రహమతుల్లాఖాన్, విజయకుమార్, మహేశ్, పాల్గొన్నారు.

రాయితీలను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న వైజయంతి

అనంతగిరి: రైతులు లాభదాయక పంటలు వేయడానికి ముందుకు రావాలని ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను, పథకాలను అందిపుచ్చుకోవాలని వికారాబాద్ నియోజకవర్గ ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి వైజయంతి కల్యాణ్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం కూరగాయ పరిశోధన కేంద్రం, వికారాబాద్ ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మదనపల్లి గ్రామంలో మహిళా దళిత రైతులకు దుంప పంటల సాగులో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణలో చామగడ్డ, మొరంగడ్డ ముఖ్యమైనవని అన్నారు. అవీ రంగారెడ్డి జిల్లాలో మాత్రమే సాగు చేయబడుతుందని చెప్పుకొచ్చారు. వికారాబాద్ పట్టణ పరిసరప్రాంతాల్లోని అత్వెల్లీ, కొంపల్లి, మదనపల్లి, ఎర్రవల్లి, పులమద్ది గ్రామాల్లోని భూములు ఈ దుంప పంటలకు అనుకూలం. హైదరాబాద్ సమీపాన ఉండతో కూరగాయల సాగు చేపట్టవచ్చని చెప్పారు. అనంతరం శ్రీ కొండ లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం కూరగాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డా.సురేశ్ మాట్లాడుతూ చామగడ్డ, మొరం గడ్డ సాగు, యాజమన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కూరగాయ పరిశోధన కేంద్రం ఏఈవోలు ప్రశాంత్, కుమార్, అధికారులు, రైతులు హన్మంతు, అశోక్, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బొంరాస్‌పేట: స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు పద్మావతికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి, కేఎన్‌పీఎస్ సంఘాల నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) బ్రాంచ్‌లో చాలా సమస్యలు ఉన్నాయని ఆసంఘాల నాయకులు విన్నవించారు. బ్యాంకులో సిబ్బందిని పెంచాలని, అదనపు క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మూడు నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఈ విషయంలో బ్రాంచ్ మేనేజరు వాసు దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, దుప్‌చర్ల నర్సింలు, కేఎన్‌పీఎస్ వెంకటయ్య, బీసీ సంఘం చిన్నయ్య, మల్లప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.